# 1 నూతన పాఠ్యపుస్తకాలు - తాత్విక అవగాహన

© SCERT not to be republished

**ఉపోద్ఘాతం :**

రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం -2011 ప్రకారం పాఠ్యపుస్తకాలు పిల్లల్ని ఆలోచింపజేయటానికి, పిల్లలు తమకున్న సహజమైన శక్తి సామర్థ్యాలు వినియోగించుకొని నేర్చుకోడానికి దోహదపడాలని సూచించింది.

పిల్లలు పొందిన జ్ఞానాన్ని నిత్యజీవితంలో వినియోగించుకోడానికి అవకాశం ఇవ్వడంతోపాటు, పాఠ్యపుస్తక పరిధినిదాటి అదనపు అంశాలు అభ్యసించడానికి అవకాశం కల్పించేలా ఉండాలని తెలియజేసింది. ఆలోచింపజేసే అభ్యాసాలద్వారా నిర్ధారిత భాషా సామర్థ్యాలను విద్యార్థులు పొందగలగాలని సూచించింది.

ఇలా APSCF పాఠ్యపుస్తకాల రూపకల్పనకు నిర్ధారించిన ప్రతిపాదనలను ఆధారంగా చేసుకొని నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించారు.

అలాగే విద్య యొక్క ప్రాథమిక ఉద్దేశ్యం పిల్లలందరూ బాధ్యతాయుతమైన హేతుబద్ధమైన పౌరులుగా తయారవడం. మన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రశంసిస్తూ సామాజిక మార్పుకు దోహదపడే వ్యక్తులుగా పిల్లలను తీర్చిదిద్దాలనేది మన రాష్ట్రదృక్పథం. ఈ దృక్పధాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవిద్య, పరిశోధన, శిక్షణసంస్థ నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పనను చేపట్టింది. 2013-14 విద్యాసంవత్సరానికి 4,5 తరగతుల పాఠ్యపుస్తకాలను రూపొందించింది.

ఈ నూతన పాఠ్యపుస్తకాల యొక్క తాత్విక అంశాలను అవగాహన చేసుకునే ముందు కింది ప్రశ్నలగురించి ఆలోచించండి.

*1) పాఠ్యపుస్తకాలు ఏఏ కీలక సూత్రాల ఆధారంగా తయారయ్యాయి?*

*2) నూతన పాఠ్యపుస్తకాలలోని ప్రత్యేకతలు ఏమిటి?*

*3) 4,5 తరగతుల నూతన పాఠ్యపుస్తకాలలో పాఠ్యాంశాలను ఏ అంశాలను దృష్టిలో ఉంచుకొని ఎంపిక చేశారు?*

*4) పాఠ్యపుస్తకాలలో ఏఏ భాషాప్రక్రియలను పరిచయం చేశారు?*

*5) ముందుమాటలోని ప్రధానాంశాలు ఏమిటి?*

*6) ఉపాధ్యాయులకు సూచనలలో ప్రధానంగా ఏఏ అంశాలను చర్చించారు?*

## నూతన పాఠ్యపుస్తకాల తయారీకి ఆధారమైన కీలక సూత్రాలు

- భాషా విద్యాప్రమాణాల సాధనకు దోహదపడడం.
- ఆలోచనాత్మకమైనదిగా ఉండడం ( Thought Provoking)
- మానవతా విలువలు, నైతిక విలువలను పెంపొందిచడానికి ఉద్దేశించినవిగా ఉండడం.
- పరస్పర ప్రతిచర్యలకు కేంద్రంగా (Interactive centric) ఉండడం. అంటే ఉపాధ్యాయులు – పిల్లలమధ్య మరియు పిల్లలు – పిల్లల మధ్య సమాజ సభ్యులు – పిల్లల మధ్య, సామగ్రితో పిల్లలు పరస్పర ప్రతిచర్యలకు అవకాశం కల్పించేదిగా ఉండడం.
- తోటివారిద్వారా, అదనపు పఠన సామగ్రిద్వారా, సమాజసభ్యులద్వారా నేర్చుకోవడానికి దోహదపడడం.
- సోపాన క్రమంలో బోధించడానికి వీలుగా పాఠం అమరిక ఉండడం.
- ఆనందంగా, అర్థవంతంగా నేర్చుకోవడానికి ఉద్దేశించినదిగా ఉండడం.
- తెలుగు భాషా వినియోగం పెంచేదిగా ఉండడం.
- స్వేచ్ఛగా వ్యక్తీకరణకు, ప్రతిస్పందనలకు తావిచ్చేదిగా ఉండడం.
- విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించేదిగా ఉండడం.
- బహుళ స్థాయికి ఉద్దేశించిన రకరకాల సామర్థ్యాధారిత అభ్యాసాలు ఉండడం.
- రంగురంగుల వర్ణచిత్రాలతో ఆకర్షణీయంగా పిల్లలకు ఆసక్తినికల్గించేదిగా ఉండడం.
- స్వీయ అధ్యయనాన్ని ప్రోత్సహించడం.
- విభిన్న ప్రక్రియల సమాహారంగా ఉండడం. (కథ, గేయం, పాట, పద్యాలు, ఆత్మకథ, సంభాషణలు, వ్యాసం........మొదలగునవి)
- వివిధ ఇతివృత్తాల ఆధారంగా పాఠ్యాంశాలు ఉండడం.
- సృజనాత్మకతను, కల్పనాశక్తిని పెంపొందించేదిగా ఉండడం.
- స్వతంత్ర పాఠకులుగా ఎదగడానికి అవకాశం ఇవ్వడం.
- పాఠ్యపుస్తకమే ఉపాధ్యాయులకు ఒక కరదీపికలా ఉపయోగపడడం.
- విద్యార్థుల స్వీయమూల్యాంకనానికి తావివ్వడం
- సమకాలీన సామాజిక అంశాల (Social sensetive Text) పట్ల సున్నితత్వాన్ని పెంచడం మొదలగునవి.

పై కీలక సూత్రాల ఆధారంగా నూతన పాఠ్యపుస్తకాలు రూపొందాయి. ఈ నూతన పాఠ్యపుస్తకాలలోని ప్రత్యేకతలను తెలుసుకుందాం!

## నూతన పాఠ్యపుస్తకాల భౌతిక లక్షణాలు :-

**(అ) ముఖచిత్రం (కవర్‌పేజి)**:

పాఠ్యపుస్తకం ముఖచిత్రం పుస్తకంలోని పాఠ్యాంశాలు, విషయ సన్నివేశాలకు చెందిన చిత్రాలతో ఆకర్షణీయంగా ఉంది.

- నాల్గవ తరగతి కవర్‌పేజి లోపల వైపు **"తెలుగుతల్లీ నీకు జోహారు"** అంటూ సముద్రపు శ్రీమహావిష్ణుగారు రాసిన గేయం ఉంది. వెనుక కవర్‌పేజీ అట్ట లోపలివైపు **"కిట్టు"** అనే కార్టూన్‌కథ పిల్లల ఆరోగ్యపు అలవాట్ల గురించి ఆలోచింపజేసేవిధంగా ఉంది.
- 5వ తరగతి కవర్ పేజీ లోపల వైపు తెలుగు వైభవాన్ని చాటిచెప్పే దాశరథి కృష్ణమాచార్యులుగారు రచించిన గీతం ఉంది. ఆలాగే వెనుక కవర్ పేజీలోపలివైపు **"తాను తీసిన గోతిలో"** అనే శీర్షికతో జంతువుల కార్టూన్‌కథ ఉంది.

**పాఠ్యపుస్తకం ముఖచిత్రం ఆధారంగా పిల్లలకు ఎలాంటి అభ్యాసం కల్పించవచ్చు?**

© SCERT not to be republished

**(ఆ) చిత్రాలు**

**1) ఉన్ముఖీకరణచిత్రాలు**

- పిల్లలను ఆలోచింపజేసి పాఠంవైపుకు ప్రేరేపించేలా, ఆసక్తి కల్గించడంకోసం ప్రతిపాఠానికి ముందు సంసిద్ధతా చిత్రాలను చేర్చారు.
- చిత్రంలోని సన్నివేశాల గురించి పిల్లలందరితో తప్పనిసరిగా వివిధరకాలుగా మాట్లాడించడం మరియు ఆలోచింపజేయడం ఈ చిత్రం ముఖ్యోద్దేశం. సన్నివేశ చిత్రంగురించి మాట్లాడించడం కోసం మూడు ప్రశ్నలు కూడా ఉన్నాయి. అదనపు ప్రశ్నలుకూడా అడగవచ్చు.

**2) పాఠ్యాంశచిత్రాలు**

- ప్రతిపాఠంలో పాఠ్యవిషయానికి సంబంధించిన చిత్రం ఉంది. పాఠంగురించి ఊహించడానికి, అర్థంచేసుకోడానికి చిత్రం ఉపయోగపడుతుంది.

**3) అభ్యాసాధారిత చిత్రాలు**

- కొన్ని పాఠాలలో అభ్యాసాల వద్దకూడా చిత్రాలున్నాయి. ఇవి పిల్లలకు పాఠంలోని విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకోడానికి ఉపకరిస్తాయి. అట్లే అభ్యాసాలను చేయడానికి ఆధారాలుగా ఉంటాయి.

**పాఠ్యపుస్తకాలలోని చిత్రాలతో పిల్లలకు కలిగేప్రయోజనాలు ఏమిటి? కొన్ని అభ్యాసాలను తెల్పండి.**

**(ఇ) లోగోలు**

- ప్రతిపాఠంలోనూ విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాల వివరాలను సూచించే చిత్రరూపమే **'లోగో'**
- లోగో చూడగానే విద్యార్థులకు తాము చేయవలసిన ప్రక్రియ వెంటనే గుర్తుకు వస్తుంది.

**లోగోలను ఉపయోగించడం ద్వారా పిల్లలకు కలిగే ప్రయోజనం ఏమిటి?**

**(ఈ) ముద్రణ**

- విద్యార్థులు చదవడానికి అనుకూలమైన పరిమాణంలో అక్షరాలు ఉన్నాయి.
- లావుపాటి అక్షరాలతో సూచనలు ఉన్నాయి.
- పెద్ద అక్షరాలతో పాఠాల పేర్లు, రంగుల పెద్ద అక్షరాలతో సామర్థ్యాల పేర్లు ఉన్నాయి.
- పాఠ్యపుస్తకాలను బహుళరంగుల్లో ముద్రించడంవల్ల వీటిపట్ల పిల్లలకు ఆకర్షణ పెరుగుతుంది.

**ప్రత్యేకలక్షణాలు**

**(అ) భాష**

- పిల్లలకు సులభంగా అర్థమయ్యేవిధంగా సరళమైన భాషలో పాఠాలు, కృత్యాలు, సూచనలు ఉన్నాయి.
- ఆధునిక వ్యవహార భాషను ఎక్కువగా వినియోగించారు.
- పాఠాలలోని అభ్యాసాలలోని సూచనలు దాదాపు ఒకేలా ఉండేలా జాగ్రత్త వహించారు. దీనివల్ల సొంతంగా చేయడానికి అలవాటు పడతారు.

**ప్రాథమిక స్థాయి పాఠ్యపుస్తకాలలో వినియోగించే భాష యొక్క ప్రాధ్యాన్యత ఏమిటి? బహుభాషా పిల్లలున్న తరగతిలో ఉపాధ్యాయుడు ఈ పాఠ్యపుస్తకాలను ఎలా ఉపయోగించాలి?**

© SCERT not to be republished

**(ఆ) ముందు మాట**

ముందుమాటలో పాఠ్యపుస్తకాల తాత్వికత, నేపథ్యం గురించి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాల గురించి, పాఠ్యపుస్తకం విశేషాలగురించి, ఉపాధ్యాయుల బాధ్యతల గురించి సంక్షిప్తంగా తెలియజేశారు. పుస్తకాలు వినియోగించుకునే విధానం గురించి కూడా తెలియజేశారు.

**(ఇ) ఉపాధ్యాయులకు సూచనలు :**

నూతన వాచకాన్ని ఉపాధ్యాయులందరూ ఆశించినరీతిలో వినియోగించడంకోసం స్పష్టంగా ఉపాధ్యాయులకు సూచనలు పుస్తకంలోనే చేర్చారు. ఉపాధ్యాయులు ఈ నూతన పాఠ్యపుస్తకాన్ని ఎలా బోధించాలో, అభ్యాసాలను ఎలా నిర్వహించాలో సవివరంగా తెలియజేశారు. ఉపాధ్యాయులకు సూచనలు ఒకరకంగా ఉపాధ్యాయకరదీపికలాగా ఉపయోగపడుతుంది. బోధనాప్రణాళికతోపాటు, మూల్యాంకనం గురించి, ఉపాధ్యాయుని బాధ్యతల గురించి కూడా వివరంగా సూచనలు ఉన్నాయి.

ఉపాధ్యాయ సూచనలు బోధనకెలా తోడ్పడతాయి?

**(ఈ) యూనిట్ల విభజన**

- పాఠ్యపుస్తకంలో 16 పాఠాలున్నాయి. వాటిని CCE కనుగుణంగా నాలుగు యూనిట్లుగా విభజించారు. ఏ మాసంలో ఏఏ పాఠాలు పూర్తిచేయాలో విషయసూచికలో సూచించారు.
- ప్రతి పాఠం శీర్షిక వద్ద ఆ పాఠంయొక్క యూనిట్ వివరాలు ఇచ్చారు.
- విషయసూచికలో పాఠంయొక్క ప్రక్రియారూపం, ఇతివృత్తం వివరాలు కూడా ఉన్నాయి.
- విషయసూచికలో పువ్వుగుర్తుతో ప్రత్యేకంగా అంశాలు ఉన్నాయి. ఇవి **"చదువు–ఆనందించు"** విభాగానికి ఉద్దేశించినవి. కథలు, గేయాలు, వ్యాసం రూపంలో ఉన్నాయి.
- అదనపు పఠనానికి, పఠనాభిలాషను పెంపొందించడానికి వీటిని ఉపయోగించాలి. వీటిని మూల్యాంకనమునకు వినియోగించకూడదు అని ప్రత్యేకంగా విషయసూచికలో కింద సూచన కూడా ఇచ్చారు.

**(ఉ) వివిధ ఇతివృత్తాలు – పాఠ్యాంశాలు**

నూతన పాఠ్యపుస్తకంలోని పాఠ్యాంశాల ఇతి వృత్తాలను కిందతెల్పిన కీలక అంశాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించారు. అవి.

1. ***దేశభక్తి విలువలు, మానవ సంబంధాలు***
2. ***పిల్లల స్వభావం, శక్తి సామర్థ్యాలు, ఆసక్తులు***
3. ***పర్యావరణం, ప్రకృతి, సమాజం***
4. ***సంస్కృతి, సంప్రదాయాలు, భాషాభిరుచి***
5. ***హాస్యం, కాల్పనికత, సృజనాత్మకత***

పై అంశాలను దృష్టిలో ఉంచుకొని 4,5 తరగతుల పిల్లల స్థాయికి అనుగుణంగా వివిధ ఇతి వృత్తాలను ఎంపిక చేశారు. వీటికనుగుణంగా పాఠ్యాంశాలను ఎంపిక చేశారు.

**4,5 తరగతుల పాఠాలను పరిశీలించండి – వాటి ఇతివృత్తాలను తెల్పండి.**

© SCERT not to be republished

**(ఊ) పాఠ్యాంశాలు - వివిధ ప్రక్రియలు**

ఎంపిక చేసిన ఇతి వృత్తాలకు అనుగుణంగా వివిధ ప్రక్రియలను పరిచయం చేస్తూ పాఠాల ఎంపిక చేశారు. ఈ ప్రక్రియల్లో ముఖ్యంగా గేయం, కథ, వ్యాసం, కథనం, సంభాషణ, పద్యం, లేఖ, గేయకథ, ఆత్మకథల వంటివి ముఖ్యమైనవి. ఇవే కాకుండా పాఠాలలో అంతర్భాగంగా పోస్టరును కూడా పరిచయం చేశారు.

**(ఎ) పాఠం అమరిక**

- ✦ ప్రతి పాఠానికీ ముందు సూచనలతో గూడిన ఉన్మ్ముఖీకరణ చిత్రం ఉంది. ఈ చిత్రం కింద ప్రశ్నలు ఉన్నాయి.
- ✦ ఈ చిత్రంకింద **"పిల్లలూ! ఇలా చేయండి"** అనే శీర్షికతో పిల్లలతో పాఠం చదివించడానికి వాళ్ళంతట వాళ్ళే అర్థాలను గ్రహించడానికి సూచనలు ఉన్నాయి.
- ✦ పిల్లలు నిఘంటువుద్వారా స్వీయ అధ్యయనం చేస్తూ తెలియని పదాల అర్థాలను తెలుసుకోవడానికి దీనిద్వారా అవకాశం కలిగింది.
- ✦ ప్రతిపాఠం సంబంధిత చిత్రంతో ఆసక్తిదాయకంగా, ఆకర్షణీయంగా ఉంది. పాఠం ప్రారంభించడానికి ముందు పాఠాన్ని ఆసక్తిగా చదివించడానికి ముందుగా కొన్ని ప్రేరణ వాక్యాలు కూడా ఉన్నాయి. తరవాత పాఠం ఉంటుంది.
- ✦ పాఠంపూర్తయ్యాక **"ఇవిచేయండి"** శీర్షికతో ఆ పాఠం ఆధారంగా సాధించాల్సిన భాషా సామర్థ్యాలు అభ్యాసాలరూపంలో ఉన్నాయి.
- ✦ ప్రతిపాఠంలో భాషాభిరుచి పెంపొందిచడానికి ప్రత్యేకంగా ప్రాజెక్టుపనులను ఇచ్చారు.
- ✦ పిల్లలే స్వయంగా తమ ప్రగతిని అంచనావేసుకోవడానికి **"నేనివి చేయగలనా?"** అనే శీర్షికతో స్వీయమూల్యాంకన కృత్యం ఇవ్వడమైంది.
- ✦ ప్రతి పాఠం చివర విలువను ప్రతిబింబించేలా ఒక మహనీయుని **'సూక్తి'** ఉంది.

**(ఏ) సామర్థ్యాధారిత అభ్యాసాలు**

భాషాలక్ష్యాలను సాధించే క్రమంలో ప్రతి పాఠం చివర 7 సామర్థ్యాలను నిర్దేశించి అభ్యాసాలను రూపొందించారు. వీటిని ప్రత్యేకమైన లోగోతో సూచించారు.

అవి : 1) వినడం, ఆలోచించిచెప్పడం

2) చదవడం, అర్థం చేసుకొని చెప్పడం, రాయడం

3) ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)

4) పదజాలం

5) సృజనాత్మకత

6) ప్రశంస

7) భాషను గురించి తెలుసుకుందాం.

ప్రతిపాఠంలోనూ పైవాటితోబాటు ప్రాజెక్టుపనులను కూడా చేర్చారు. ఇవి భిన్నసామర్థ్యాల సమాహారం.

© SCERT not to be republished

**(ఐ) చదువు – ఆనందించు**

- పిల్లల్లో పఠనాశక్తిని పెంపొందించుటకు, స్వీయ అధ్యయనంపై విద్యార్థికి పట్టు పెంచుటకు కథలు / గేయాల రూపంలో **"చదువు–ఆనందించు"** అంశాలు ఉన్నాయి.
- ఇవి విద్యార్థి స్వయంగా చదివి, అవగాహన చేసుకుని ఆనందించుటకు ఉద్దేశించినవి మాత్రమే. (మూల్యాంకనం కోసం కాదు)

**(ఒ) పునశ్చరణ అభ్యాసాలు**

- ఇంతకు ముందు తరగతులలో నేర్చుకున్న అంశాలు పునశ్చరణ జరిగేలా ముందు పాఠాలలో పునశ్చరణ కోసం అభ్యాసాలున్నాయి. దీనివల్ల విద్యాసంవత్సరం ప్రారంభంలో పిల్లలకు కనీస సామర్థ్యాల సాధనకోసం అభ్యాసంకల్పించడానికి, పునశ్చరణకు అవకాశం లభిస్తుంది.

**(ఓ) "పదాలు – అర్థాలు" పట్టిక**

- విద్యార్థులు పాఠాలు చదువుతున్నపుడు కొత్త పదాలకు అర్థాలను తెలుసుకోవడానికి పాఠ్యపుస్తకాల చివర **"పదాలు – అర్థాలు"** పట్టిక ఇవ్వడం ద్వారా స్వీయ అధ్యయనానికి అవకాశం కల్పించారు.

**(ఔ) సాధించాల్సిన సామర్థ్యాలు**

- నూతన పాఠ్యపుస్తకాల ద్వారా సంవత్సరాంతానికి ఆయా తరగతుల పిల్లలు ఏఏ సామర్థ్యాలు సాధించాలో పాఠ్యపుస్తకంలో ఇచ్చారు. ఆ సామర్థ్యానికి సంబంధించి పిల్లలకు ఏమేమి రావాలో, పిల్లలు ఏమేమి చేయగలగాలో కూడా స్పష్టంగా తెలియజేసారు.

కావున ఉపాధ్యాయులుగా బోధనాభ్యాసన ప్రక్రియలు నిర్వహించే ముందు నూతన పాఠ్యపుస్తకాల తాత్వికతను అర్థం చేసుకొని ముందుమాట, ఉపాధ్యాయుల సూచనలలో ఇవ్వబడిన అంశాలకు తగిన విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. సామర్థ్యాల సాధనకు కృషి చేయాలి.

© SCERT not to be republished

*విద్యావ్యవస్థలో పిల్లలు, ఉపాధ్యాయులు కీలకమైనవారు, పిల్లలను జ్ఞాన నిర్మాతలుగా భావించినపుడు ఉపాధ్యాయులలో, పాఠ్యపుస్తకాలలో, బోధనాభ్యసన ప్రక్రియలలో బృహత్తరమైన మార్పులు చోటుచేసుకోవాలి. జ్ఞాన నిర్మాణానికి దోహదపడేలా బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లలకు అనేకరకాలైన అనుభవాలను కల్గించాలి. దీంట్లో పిల్లల భాష కీలకమైనది. తరగతిగదిలో పిల్లలభాష, వారి జ్ఞాన నిర్మాణానికి తోడ్పడాలి. భాషా తరగతిగదిలో కథలు చెప్పడం, గేయాలు, లయబద్ధమైన పాటల వంటి వ్యవహార రూపాల్లో భాషా సముపార్జన ఉండాలి. ఈ రూపాలు భాషను నేర్చుకునేలా చేస్తాయి.*

*– ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధిపత్రం 2011*